ఖరీఫ్‌కు సన్నద్ధం

తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయి. విస్తారంగా వర్షాలు కురవడంతో అన్నదాతలు ఈ యేడాది కోటి ఆశలతో వ్యవసాయ పనులకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని చోట్ల విత్తు నాటుతూ ఈ యేడాది మళ్లీ వ్యవసాయ జూదానికి సిద్ధమవుతున్నారు.

– ఆత్మకూరు

- గతేడాది అతివృష్టి, అనావృష్టితో నష్టపోయిన అన్నదాత
- మరోసారి అదృష్టం పరీక్షించుకునేందుకు రైతన్న సమాయత్తం



మొక్కజొన్న విత్తు వేస్తున్న రైతులు

ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఈ యేడాది ఏప్రిల్, మే నెలల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో అన్నదాతలు ముందస్తు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. మే ప్రారంభం నుంచే వ్యవసాయ పనుల్లో నిమగ్నమై పొలాలను దుక్కిదున్నడం, పొలాలను చదును చేయడం తదితర పనులు చేపట్టారు. మే నెలలో రికార్డుస్థాయిలో వర్షాలు కురవడం, సాధారణ వర్షపాతం 29 మి.మీ. గానూ ఇప్పటికే రికార్డుస్థాయిలో 105 మి.మీ. వర్షం పడడంతో అన్నదాతలు విత్తు వేసుకున్నారు. ఆత్మకూరు మండలంలోని కరివేన, నల్లకాల్వ, కొత్త రామాపురం, ముష్టపల్లి, వెంకటాపురం, కృష్ణాపురం గ్రామాలతోపాటు పాములపాడు మండలంలోని బానుముక్కల, ఎర్రగూడూరు, కొత్తపల్లి మండలం, నందికుంట్ల, దుద్యాల, ఎర్రమఠం, సిద్ధేశ్వరం తదితర గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి విత్తనాలు నాటుకున్నారు. ఇప్పటికే దాదాపు 20 శాతానికి పైగా విత్తు వేయగా, పొలాలను చదును చేసి విత్తు చేసేందుకు మరికొందరు రైతులు సిద్ధమవుతున్నారు.

అత్యధికంగా మొక్కజొన్న, పత్తి పంటల సాగు

ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు మండలాల్లో అత్యధికంగా మొక్కజొన్న, పత్తి పంటలను విస్తారంగా నాటుతున్నారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో సాధారణంగా 4,750 హెక్టార్ల నుంచి 9 వేల హెక్టార్ల వరకు మొక్కజొన్నను సాగుచేసే అవకాశం ఉంది. అలాగే పత్తి పంటను సైతం 2 వేల హెక్టార్ల నుంచి 4 వేల హెక్టార్ల వరకు పంటను సాగుచేసే అవకాశం ఉంది. వర్షాలకు అనుకూలంగా ఉంటే పత్తి పంట బదులు అత్యధికంగా మొక్కజొన్న పంటలకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే 20 శాతానికి పైగా విత్తనాలు వేసిన రైతులు మృగశిర కార్తె అనంతరం మరోమారు విస్తారంగా వర్షాలు కురిస్తే పూర్తిస్థాయిలో విత్తు వేసేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు.

గతేడాది నష్టపోయిన రైతులు

గతేడాది ఖరీఫ్, రబీ పంటల్లో రైతన్నలు కోట్లాది రూపాయల్లో పంట నష్టం చవి చూశారు. గతేడాది ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోగా, రబీలో మినుము, పొగాకు పంటల వల్ల రైతన్నలు నష్టం వర్ణణాతీతం. ఏ రైతునుకదిలించినా పంట పండకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే ఈ యేడాది వరుణుడు రెండు నెలల ముందుగానే కరుణించడం వల్ల పంటలు వేసిన అనంతరం వరుణుడు ఎలాంటి ప్రభావం చూపుతాడేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ యేడాది కూడా రైతులు విత్తు వేసుకుంటూ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ముందస్తు వర్షాలకు విత్తు వేశా



ఈ యేడాది కూడా ముందస్తు వర్షాలు కురవడంతో మే నెల 10వ తేదీ నుంచే పత్తి, మొక్కజొన్న పంటలను సాగుచేశా. వరుణుడు కరుణిస్తే మంచి పంటలు పండుతాయి. గతేడాది అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయాను. ఈ యేడాది సకాలంలో వర్షాలు కురిస్తే పంటలు బాగా పండే అవకాశం ఉంది.

– వెంకటేశ్వర్లు, ఆత్మకూరు రైతు

నాలుగు ఎకరాలు సాగుచేశాను



నాలుగు ఎకరాల్లో మొక్కజొన పంటను వేశాను. ఇంకా ఆరు ఎకరాల్లో పంట సాగు చేయాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభమయ్యాయి. వర్షాలు ఆశాజనకంగా కురిస్తే మిగిలిన పొలాలను కూడా సాగుచేసి విత్తు వేస్తాను. ఈ యేడాది రైతన్నల భవిష్యత్ అంతా వానదేవుడిపైనే ఉంది. గతేడాది నష్టపోయాం. ఈ యేడాది అయినా మంచి పంటలు పండుతాయని ఆశిస్తున్నాను.

– అశోక్, ఆత్మకూరు రైతు

క్లుప్తంగా

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మహా మంగళ హారతుల పూజలు చేపట్టారు. వందలాది మంది భక్తులు పల్లకీసేవలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేయగా పల్లకీని మోశారు. ఆలయ ప్రాకారంలోని ధ్వజస్తంభం వద్ద స్వామి, అమ్మవార్లకు హారతి ఇచ్చిన అనంతరం ఉత్సవమూర్తులను అలంకార మండపంలోకి చేర్చారు.

గోసంరక్షణ నిధికి రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణ నిధి పథకానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఎస్.ఆర్.అనురాధదేవి రూ.1,00,516 విరాళాన్ని పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు.దాతను దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను,జ్ఞాపికను అందించి సత్కరించారు.

నేటి నుంచి గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు

బండి ఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లోని సచివాలయాల్లో నేటి నుంచి ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.దస్తగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10, 11 తేదీల్లో ఎర్రగుంట్ల, 12, 13 తేదీల్లో లింగాపురం, 24, 25వ తేదీల్లో కడమలకాలువ, 26, 27 తేదీల్లో బి.కోడూరు గ్రామాల్లో ఆయా గ్రామ సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను నిర్వహించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుడి నిర్మాణానికి భూమి పూజ

పాములపాడు: మండలంలోని శాంతి నిలయం గ్రామంలో సుంకులమ్మ గుడి నూతన నిర్మాణానికి సోమవారం గ్రామస్తులు భూమి పూజ చేశారు. పురోహితులు ఆలయ నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంతోపాటు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కమిటీ పెద్దలు కోరారు.

బాలికలకు రక్షణ కరువు

పాములపాడు: కూటమి ప్రభుత్వంలో బాలికలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాములు నాయక్ అన్నారు. అనంతపురం జిల్లా కూడేరు మండలంలో జరిగిన గిరిజన విద్యార్థిని దారుణ హత్యను ఆయన ఖండించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బీజేపీతోనే దేశ అభివృద్ధి



మొక్క నాటుతున్న మోమిన్‌షబానా

ఆత్మకూరు: బీజేపీ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 యేళ్లు పూర్తి కావడంతో సోమవారం జాతీయ మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యురాలు మోమిన్‌షబానా స్థానిక పార్టీ కార్యాలయంలో మొక్క నాటి నీరు పోశారు. ముందుగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమన్నారు. పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, వెంకటరామిరెడ్డి, కృష్ణారెడ్డి, బాలిరెడ్డి, మల్లారెడ్డి, అన్వర్, ఖాదర్‌వలీ, సుదర్శన్‌సింగ్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): ఈ విద్యా సంవత్సరం (2024–25) పదవతరగతిలో ఉత్తీర్ణత సాధించిన ముస్లిం మైనార్టీ విద్యార్థులకు రూ.3000 చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తున్నట్లు అంజుమన్ సంస్థ అధ్యక్షుడు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం ఈ సాయం అందించనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల అంజుమన్ సంస్థలో ఉచితంగా లభించే దరఖాస్తు ఫారంలో పూర్తి వివరాలు నింపి 10వ తరగతి మార్క్ లిస్ట్, స్టడీ సర్టిఫికెట్, కళాశాలలో చేరిన ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు జత చేసి జూన్ 30వ తేదీలోపు పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్: 98662 42724 సంప్రదించాలన్నారు.

షైనింగ్‌స్టార్ అవార్డులకు విద్యార్థుల ఎంపిక



అవార్డులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాగరవీంద్ర



షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్న సున్నిపెంట విద్యార్థినులు

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు నలుగురు షైనింగ్ స్టార్ అవార్డులు సాధించారని ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన మల్లన్న, యశశ్విని, హైమావతి, భవానీలకు జిల్లా కేంద్రంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారీ అవార్డులు అందించారన్నారు.

సున్నిపెంట విద్యార్థులు..

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలోని డీఏవీ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డులు సాధించారు. విద్యార్థినులు ఆర్.మైత్రేయి, కె.బి.షణ్ముణ ప్రియ, వాసవి, నాగప్రణీతారెడ్డిలకు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అవార్డు, సర్టిఫికెట్‌తో పాటు నగదు బహుమతులను అందజేశారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థిని..

మహానంది: యం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పి.కమలాకర్, జి.చైతన్యశ్రీ, పి.ఉమామహేశ్వరిబాయి పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్ అవార్డ్‌కు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మణరావు తెలిపారు. సోమవారం నంద్యాలలో అవార్డులను కలెక్టర్‌తో అందుకున్నట్లు తెలిపారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు పదో తరగతిలో అధిక మార్కులు సాధించి షైన్‌స్టార్ అవార్డులకు ఎంపికయ్యారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు జుర్రు హారిక, బర్రు హేమచంద్రారెడ్డి, గురుకుల పాఠశాల విద్యార్థులు కొమ్మరి రవితేజ, తోళ్ల రెడ్డి పోగు జగదీష్, మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బోయ కల్పన, జూపాడుబంగ్లా ఉన్నత పాఠశాల విద్యార్థి సయ్యద్ సుమయ్య సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

బడిఆత్మకూరు విద్యార్థిని..



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న దృశ్యం

బండిఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన జీవనకాశ్ల రేష్మ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైంది. విద్యార్థినికి కలెక్టర్ ప్రశంసాపత్రంతోపాటు నగదు బహుమతి అందజేశారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రమైన భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆసీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

భక్తులు ఇచ్చిన కానుకలతోనే ఉద్యోగులకు జీతాలు

మహానంది: రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు భక్తులు ఇచ్చిన కానుకలతోనే జీతాలు ఇస్తున్నామని, రాష్ట్ర ఖజానా నుంచి ఇవ్వడం లేదని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మహానందిలో అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు వచ్చిన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. భక్తులు హుండీల్లో, ఆలయాలకు సమర్పించే కానుకల విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా ఉండి ప్రతి రూపాయను జాగ్రత్తగా వినియోగించాలన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఉంటుందని, ప్రతి నెలకు ఒకసారి దేవదాయశాఖ ఈఓలతో సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా ఆలయాల్లోని సీసీ కెమెరాలను నేరుగా దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేసేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోని శిల్పాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, ఎక్కడ ఆలయం నిర్మించినా ఆళ్లగడ్డ రాయితో తయారు చేసిన శిల్పాలు వెళ్లడమే అందుకు నిదర్శనమన్నారు.

సబ్సిడీతో కిసాన్ డ్రోన్ల పంపిణీ

వెలుగోడు: రైతులకు 80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్లు అందజేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అబ్దుల్లాపురం గ్రామ ద్వారక రైతు మిత్ర గ్రూప్‌నకు తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డితో కలిసి ఆయన కిసాన్ డ్రోన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ద్వారక రైతు మిత్ర గ్రూప్ కన్వీనర్ దేశం శివ శంకర్ రెడ్డి, రఘు స్వామి రెడ్డి, అంబాల రామకష్టారెడ్డి, సంత జూటూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఫక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలకు కనీసం మంచినీరు కూడా సరఫరా చేయకపోవడం దారుణమన్నారు. మోటార్లు చెడిపోయి నెల రోజులవుతున్నా, వీధిలైట్లు వెలగకపోయినా కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాలకృష్ణ, కాలనీ ప్రజలు చాంద్‌బాషా, అబ్దుల్, ఉన్నారు.

- పాములపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతు మహబూబ్‌బాషా తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. వాడాల గ్రామంలో సర్వేనెంబరు 617/బీ1లో తన పేరుపై ఉన్న ఎకరా పొలాన్ని ఇటీవల అడంగల్‌లో మరో ఇద్దరి పేర్లను జత చేసి ఉమ్మడి ఆస్తిగా నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. విచారించి పేర్లను తొలగించి తనకు న్యాయం చేయాలని కోరారు.
- జూపాడుబంగ్లా: ప్రజాసమస్యల పరిష్కారవేదికను సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపీకృష్ణ తదితరులు నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సీపీఐ జిల్లా నాయకుడు రమేష్ బాబు వినతిపత్రం అందజేశారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



పొట్టి శ్రీరాములు సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ కార్యకర్తలు

వెలుగోడు: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగమోహన్, మహ్మద్‌రఫీ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ గాకుండా ఆపుతామని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి గనులను కేంద్ర ప్రభుత్వం ఇచ్చేలా సేయిల్‌లో విలీనం చేస్తామని చెప్పి ఏడాదవుతున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని, లేనియెడలా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా నాయకులు రామాంజనేయులు, సీఐటీయూ నాయకులు కిశోర్, కష్ణ, బాషా, రహంతుల్లా, కృష్ణ, ఆంజనేయులు, రహంతుల్లా, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

- ఆత్మకూరు: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం వారు పట్టణంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న అధికారులు

వెలుగోడు: యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. యోగా అవగాహన ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ యోగాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంఈఓ బ్రహ్మంనాయక్ పాల్గొన్నారు .

- బండి ఆత్మకూరు: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తహసీల్దారు పద్మావతి, ఎంపీడీఓ దస్తగిరి, యోగా శిక్షకులు నాగేశ్వరరావు తెలిపారు. యోగా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి భావన రెడ్డి పాల్గొన్నారు.
- నందికొట్కూరు: యోగాతో రోగాలు దూరమవుతాయని మిడుతూరు ఎంపీడీఓ దశరథరామయ్య తెలిపారు. సోమవారం మిడుతూరులో యోగాపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.
- పగిద్యాల: ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడం కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాలని జెడ్పీటీసీ సభ్యులు పుల్యాల దివ్య సూచించారు. సోమవారం యోగాంధ్ర ర్యాలీలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు పాల్గొన్నారు.
- పాములపాడు: ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు అధికారులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్లు నాగలక్ష్మి, సావిత్రీ, ఎంఈఓ సుభాషిణిదేవి పాల్గొన్నారు.
- జూపాడుబంగ్లా: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, ఏపీఎం అంబమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పుస్తకాల వ్యాపారం ఆపాలి

ఆత్మకూరు: పుస్తకాల వ్యాపారం చేస్తున్న ప్రైవే ట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్‌కుమార్, సాయిప్రశాంత్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో వారు మాట్లాడుతూ పుస్తకాలు, బెల్ట్, టీ షర్ట్ కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ప్రైవేట్ పాఠశాలలు ఒత్తిడి తెస్తున్నాయన్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు వంశీ,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో బడిబాట



బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కొత్తపల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఇంటింటికి వెళ్లి మూడేళ్లు నిండిన పిల్లల్ని గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుకోవాలన్నారు. దుద్యాల, కొత్తపల్లి సెక్టార్ల పరిధిలో ఇప్పటి వరకు 65 మంది చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుకున్నట్లు తెలిపారు.

పాములపాడు: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించాలని అంగన్వాడీ టీచర్ శివలక్ష్మి కోరారు. సోమవారం ఎస్సీ కాలనీలోని 4వ సెంటర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, వారి తల్లులతో ర్యాలీ నిర్వహించారు.

పథకాలు అమలు చేయాలి



రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నందికొట్కూరు: సార్వత్రిక ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో సీఎం చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బీబీ, లక్ష్మీదేవి, మల్లేశ్వరమ్మ, సుధాకర్, సోమన్న, రామకృష్ణ, మహబూబ్ బాషా, భాస్కర్‌గౌడ్, నారాయణ, సోమప్ప, శివ, కృష్ణ, ఎల్లనాయుడు, రాజరత్నం, మల్లమ్మ, నాగమణి పాల్గొన్నారు.

సేంద్రియంతో భూసారం



పొలాల్లో గుట్టలుగా వేసిన ఎరువు

- ఆసక్తి చూపుతున్న రైతులు

బండిఆత్మకూరు: తొలకరికి ముందు రైతులు తమ పొలాల్లో పశువుల ఎరువు వేస్తుంటారు. కొద్ది రోజుల తర్వాత భూమి దున్నే సమయంలో మరికొంత కోళ్ల ఎరువు, జీవాల ఎరువులు వేయడం ద్వారా భూమి సారవంతమవుతుందని వ్యవసాయాధికారులు చెబుతుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో కలిగే అనర్థాలను గుర్తిస్తున్న రైతులు భూసారం పెంపుపై దృష్టి సారిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలనిచ్చే సేంద్రియ ఎరువులను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పశువుల పేడ, చెరువులు, కుంటల్లో పూడిక మట్టిని పొలాల్లో వేసుకుంటున్నారు. సేంద్రియ ఎరువుల వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని చెబుతున్నారు.

ప్రయోజనాలెన్నో..

సేంద్రియ ఎరువుల వాడకం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయి. పశువుల పేడ, పూడిక మట్టి వేయడం వల్ల భూసారం పెరగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయి. భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోకుండా దోహదపడతాయి. సేంద్రియ ఎరువులు వాడిన పొలాల్లో చీడ పీడలు, తెగుళ్లు సోకవు. చెరువు మట్టి, పశువుల పేడలో నత్రజని, భాస్వరం, జింక్, మెగ్నీషియం, ఐరన్, పొటాష్, బోరాన్ వంటి పోషక విలువలు లభించడంతో పైర్లు అధిక దిగుబడినిస్తాయి.



పొలాల్లో వేసేందుకు పశువుల ఎరువును తరలిస్తున్న దృశ్యం

దిగుబడి బాగుంటుంది



పంట వేసే ముందు పశువుల ఎరువును ఎకరాకు నాలుగు ట్రక్కులు వేసి కలియదున్నడం వల్ల భూమి గుల్లబారుతుంది. పంట దిగుబడి కూడా బాగుంటుంది. భూమిలో నీటి తేమ ఎక్కువగా ఉంటుంది. మొక్కలకు రోగనిరోధక శక్తిగా ఉపయోగపడుతుంది. పైరు ఎదుగుదల బాగుంటుంది. చీడపీడలు సోకకుండా ఉంటాయి. వేపపిండి కలపడం ద్వారా పురుగులు నశిస్తాయి.

– ఎం.స్వాతి, వ్యవసాయాధికారిణి, బండిఆత్మకూరు